సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం, 20, మే, 2023



టెక్నాలజీ అభివృద్ధితోనే విస్తృత ఉపాధి అవకాశాలు

టెక్నాలజీ అభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ జి.రంగజనార్ధన పేర్కొన్నారు. -10లో..



సిటీ స్కానింగ్‌ను వినియోగించుకోండి

రిమ్స్ ఓపి విభాగంలో సిటీ స్కాన్ యంత్రాన్ని రేడియాలజీ విభాగంలో ప్రజలకు పరీక్షల కోసం ఏర్పాటు చేశారు. -10లో..



సమస్యలను పరిష్కరించాలి

తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు కోరారు. -10లో..

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కడప ఎడ్యుకేషన్ : తొండూరు మండలం అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషియల్) నంద్యాల వెంకట గంగరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధ్యాయుడిగా ఉంటూ వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారిలాగా తనిఖీలు నిర్వహించడం, డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు.

వడ దెబ్బతో వృద్ధుడు మృతి

సిద్ధవటం: మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామానికి చెందిన దాదినేని చిన్నయ్య(65) వడదెబ్బకు గురై మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు గురువారం నుంచి తలనొప్పితో బాధపడుతున్నాడు, దీనికి తోడు ఎండలు మండి పోవడంతో వడగాలులకు అనారోగ్యానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్దనే మృతి చెందాడు. చిన్నయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి.

ప్రథమ చికిత్సా కేంద్రం మూసివేత

కడప రూరల్: కడప నగరం అంగడి వీధిలో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రంపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా ఉంటున్న తమ్మిశెట్టి రమణ స్వల్ప జ్వరం కారణంగా అంగడి వీధిలో గల ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లారు. ఆయన ఇచ్చిన ఇంజక్షన్ వల్ల స్పృహతప్పి రమణ మృతి చెందారు. ఈ విషయాన్ని మృతుడి భార్య అంజనమ్మ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లింది. ఆ కౌన్సిల్ సభ్యులు ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలికి ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎంహెచ్ఓ విచారణకు ఆదేశించడంతో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సా కేంద్రాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయడంపై ఆరా తీశారు. అనంతరం దీనినిమూసివేశారు.

ఫ్రూట్ కవర్ల వాడకంతో తెగుళ్ల నివారణ

నిమ్మనపల్లె: ఫ్రూట్ కవర్ల వాడకంతో మామిడి సాగులో తెగ్గుల నివారణ సాధ్యమవుతుందని అన్నమయ్య జిల్లా కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త వై.పీరూసాహెబ్ అన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లె గ్రామంలో రైతు నరసింహులు గుప్తకు చెందిన మామిడి తోటలో దిగుబడులను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ.శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఫ్రూట్‌కవర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు

సత్కార్యాలకు సత్కారం



సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో మేయర్ సురేష్ బాబు తదితరులు

సేవలకు గుర్తింపుగా వలంటీర్లకు అవార్డులు అందజేత

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల గడప వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. వలంటీర్ల వల్ల సకాలంలో విలువైన సేవలను ప్రజలు పొందుతున్నారు. వెల కట్టలేని వారి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సత్కార కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ప్రభుత్వ సేవలు అందించిన వలంటీర్లను గుర్తించి మూడు సేవా విభాగాల ద్వారా వారికి ప్రోత్సాహక నగదు బహుమతి, బ్యాడ్జిలు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు శాలువలతో సత్కరిస్తున్నారు.శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాలో సేవావజ్ర కింద 40 మందిని గుర్తించారు.వీరిలో బద్వేలు నియోజక వర్గంలో 6, జమ్మలమడుగు లో 5, కడపలో 5, కమలాపురం 5, మైదుకూరు 5, ప్రొద్దుటూరు 5, రాజంపేటలో 4 ఉన్నారు. ఇక సేవా రత్న కింద 229, సేవా మిత్ర కింద 9864 మందిని గుర్తించారు. జిల్లా కేంద్రమైన కడపలో సేవా వజ్ర 5, సేవా రత్న 15, సేవా మిత్ర 1452 మందిని శుక్రవారం కడప మేయర్ సురేష్ బాబు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సత్కరించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 29 వరకు జిల్లాలోని ఇతర అసెంబ్లీ నియోజక వర్గాల్లో వలీంటర్ల సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా నియోజక వర్గ శాసన సభ్యుల వీలును బట్టి మండలాల వారీగా షెడ్యూల్ రూపొందించనున్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం: మేయర్

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్‌లో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌లతో కలిసి సేవా మిత్ర,సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కావాలన్నా, పింఛన్ కావాలన్నా, ఇంటి స్థలం కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. టీడీపీ హయాంలో కడప నగరంలో 14వేల మంది ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 824 మందికే ఇచ్చారని, అందులో 490 మంది కరుడుగట్టిన టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 21వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. అర్హత ఉంటే చాలు కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే నేరుగా అందించడం జరుగుతోందన్నారు. అన్ని సంక్షేమ పథకాలు ఎంతో పారదర్శకంగా లబ్ధిదారులకు చేరుతున్నాయంటే అందుకు కారణం వలంటీర్లేనని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదినే అవ్వాతాతలకు, వికలాంగులు, వితంతువులకు తెల్లవారుజామునే తలుపుతట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. కోవిడ్ సమయంలో, వరదలు సంభవించినప్పుడు వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, కార్పొరేటర్లు చెన్నయ్య, సుబ్బారెడ్డి, నాగేంద్ర, సానపురెడ్డి శివకోటిరెడ్డి, పాకా సురేష్, మల్లికార్జున, కె. బాబు, కె. సూర్యనారాయణరావు, షఫీ, షంషీర్, కో ఆప్షన్ సభ్యులు జహీర్, పత్తిరాజేశ్వరి, బండి మరియలు, డివిజన్ ఇన్‌చార్జులు సుదర్శన్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల బదిలీ

పోలీసు అధికారి	హోదా	ప్రస్తుతం	బదిలీ
పూజిత నీలం	అదనపు ఎస్పీ	ఎస్ఈబీ,కడప	ఆర్‌వీఅండ్ ఈఓ, కర్నూలు
కె. ప్రవీణ్‌కుమార్	అదనపుఎస్పీగా	డీఎస్పీ,డీపీటీసి,అనకాపల్లి	ఎస్ఈబీకడప పదోన్నతి
బి.ఉమామహేశ్వర్	అదనపుఎస్పీ	ఆర్‌వీఅండ్ఈఓ,కడప	అదనపు ఎస్పీ సీఐడీ
షేక్ మాసుంబాషా	అదనపుఎస్పీగా పదోన్నతి	వెయిటింగ్ డీఎస్పీ	ఆర్‌వీఅండ్ ఈఓ, కడప
ఆర్.రాఘవేంద్ర	అదనపుఎస్పీగా పదోన్నతి	ఇంటలిజెన్స్,కడప	పల్నాడుజిల్లా అదనపు ఎస్పీ

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌ను ఇచ్చారు. అదనపు ఎస్పీలుగా ఉన్న కొందరిని బదిలీ చేశారు. వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా 37 మందితో ఉన్న ఉత్తర్వుల జాబితా శుక్రవారం జారీ చేశారు.



పూజిత నీలం



ఉమామహేశ్వర్

పర్యాటక రంగాన్ని విస్తృతం చేయాలి

కలెక్టర్ విజమరామరాజు



కడప సెవెన్‌రోడ్స్: సహజ వనరులు పుష్కలంగా ఉన్న వైఎస్సార్ జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని..అందుకు తగ్గట్లు పర్యాటక ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా టూరిజం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నగర వనాల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. సాహస క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా పర్యాటకులను ఆకర్షించేందుకు జిల్లాలో సాహస క్రీడల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. టికెటింగ్ విధానంలో ఆదాయ నష్టాన్ని తగ్గించాలని, జవాబుదారీతనాన్ని పెంచాలన్నారు. టూరిజం ప్రాంతాల్లో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, టికెటింగ్ వ్యవస్థను డిజిటలైజ్ చేయడంతో సహా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. టూరిజం సంబంధిత కార్యకలాపాల కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటుపై కమిటీ చర్చించింది. 'స్వదేశీ దర్శన్'పథకంలో భాగంగా ఎంపిక చేసిన గండికోటపై జూన్ నెలాఖరులోగా డీపీఆర్ తయారు చేయాలని నిర్ణయించారు. ఏపీ టూరిజం డెవెలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) బస్సు సర్వీసు ప్రతిపాదనపై కమిటీ చర్చించింది. సిద్ధవటం అతిథి గృహాన్ని కస్టోడియన్‌షిప్ కోసం అటవీ శాఖకు కేటాయించడంపై చర్చించారు. ఒక గది అద్దెకు అనుమతించాలని ప్రతిపాదించి, దాని నియంత్రణ జిల్లా పాలనా యంత్రాంగం చేతిలో ఉండేలా నిర్ణయించింది. జిల్లా టూరిజం కార్పొరేషన్(డీటీసీ)ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. జిల్లాలో పర్యటకానికి అవకాశం ఉన్న ప్రాంతాలు, అభివృద్ధి చేయగల ప్రాంతాలను గుర్తించాలన్నారు.కడప, ప్రొద్దుటూరు, పులివెందుల నగర వనాల్లో ప్రచార బోర్డుల పునరుద్ధరణ, జాగర్లు, ద్విచక్ర వాహనదారులకు దిశానిర్దేశం చేసే బోర్డుల ఏర్పాటుపై చర్చించారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు శని, ఆదివారాల్లో ఉదయం ట్రెక్కింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దేవదాయ శాఖకు సంబంధించి గండి ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు. బ్రహ్మంసాగర్ సమీపంలోని నీటి పారుదల శాఖ యాజమాన్యం నుంచి నాలుగు గదులను ఏపీ టూరిజం కమిటీ కోసం వినియోగించుకునేలా సూచించారు. బి. మఠం దేవాలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సమర్పించడంపై చర్చించారు. పాత కలెక్టరేట్ భవన పునరుద్ధరణ, అంచనాల ఆవశ్యకతపై చర్చించారు.అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, జిల్లా పర్యాటక అధికారి ఎస్. మల్లికార్జున, ఏపీటీడీసీ డీఈఈ కుమార్,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, జిల్లా టూరిజం కమిటీ మెంబర్ వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి

నిర్దేశిత లక్ష్య సాధన దిశగా.. పేదలందరికి ఇళ్ల పథకం అమలులో ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ విజమరామరాజు క్షేత్ర స్థాయి ఇంజినీర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాలులో హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహనిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, అభివద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు-పరిష్కారాలు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఇంజినీరింగ్ అధికారులు హౌసింగ్ లక్ష్య సాధన కోసం ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టిన సచివాలయ భవనాలు, ఆర్బీకేలు,డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ క్లినిక్‌లను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఈభవన నిర్మాణాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అలాగే సాంఘిక సంక్షేమ హాస్టళ్ల భవనాలను 7.67 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని వచ్చేనెలలో వీటిని పూర్తిచేయాలని చెప్పారు. సమావేశంలో పీఆర్ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఫల రాజసం

- తలపుల నుంచి ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతి
- సహకార సంఘాలతో దళారీ వ్యవస్థకు చెక్
- రూ.7.80 కోట్లతో జిల్లాలో 52 కలెక్షన్ సెంటర్లు



మామిడిని గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం



ఎగుమతికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు

పీలేరురూరల్ : అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలోని తలపుల నుంచి ఇతర రాష్ట్రాలకు జోరుగా మామిడి ఎగుమతి జరుగుతోంది. రైతు సహకారం సంఘాలతో దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి సంఘం ద్వారా రైతుల నుంచి మామిడి కొనుగోలు చేసి గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరాఖాండ్, డెహరాడూన్, జార్ఖండ్ రాష్ట్రాలకు నాణ్యమైన మామిడి ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది 3 వేల టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు శ్రీ అన్నమయ్య రైతు సహకార సంఘం నిర్వాహకులు తెలిపారు. బెనీసా రకం టన్ను రూ. 30 వేలు, ఖాదర్ టన్ను రూ.40 వేలు, తోతాపురి కలర్ రకం టన్ను రూ. 20 వేలు, తోతాపురం జ్యూర్ రకం రూ.19 వేలు చొప్పున ధర పలుకుతోంది. దీంతో రైతులకు గిట్టుబాటు లభిస్తోంది.

సహకార సంఘాలతో బహుళ ప్రయోజనాలు...

మామిడి రైతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు సహకార సంఘాలను ప్రోత్సహిస్తోంది. వీటికి పలు రాయితీలు ఇస్తుండడంతో మామిడి రైతులు అభివృద్ధి చెందుతున్నారు. ఈ క్రమంలో పీలేరు ఉద్యాన శాఖ పరిధిలో ఐదేళ్ల క్రితం మూడు సహకార సంఘాలు ఏర్పడ్డాయి. వీటిలో పీలేరు మండలం తలపులలో శ్రీ అన్నమయ్య రైతు సహకార సంఘం 15 మంది సభ్యులతో ప్రారంభమైంది. పీలేరు తోపాటు రొంపిచెర్ల, కేవీపల్లె, యర్రావారిపాళెం మండలాల్లోనూ అభివృద్ధి చెంది ప్రస్తుతం 750 సభ్యులను కలిగి ఉంది. ఉద్యానశాఖ అధికారుల సూచనలతో మంచి దిగుబడి, నాణ్యత పెంచడం తోపాటు మామిడికి మధ్యవర్తులు, వ్యాపారుల మోసాలకు తావు లేకుండా గిట్టుబాటు ధరతో సరైన మార్కెటింగ్ కల్పించుకున్నారు. రైతులను ప్రోత్సహిస్తూ సహకార సంఘాలకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ప్రభుత్వం 75 శాతం రాయితీతో ఇస్తోంది. తలపులలోని అన్నమయ్యయ రైతు సహకార సంఘం ఏపీఐఎల్ఐపీ-2 ప్రాజెక్టులో గుర్తింపు పొందడంతో ఈ ప్రాజెక్టు ద్వారా గత ఏడాది రైతులకు నీటిలో కరిగే ఎరువులు రాయితీతో సరఫరా చేశారు. అలాగే ఈ ఏడాది ఒక్కో రైతుకు హెక్టారుకు రూ. 24 వేలు యూనిట్ వ్యయం కింద ఎరువులు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకుగానూ ప్రభుత్వం రాయితీ పోనూ కేవలం రూ. 6 వేలు రైతు చెల్లిస్తే సరిపోతుంది. ఈ పథకం కింద 245 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. దీంతో రైతులకు రూ. 45.72 లక్షలు ప్రయోజనం చేకూరినట్లైంది. అలాగే ఒక్కో రైతుకు 5 బస్తాలు యూరియా, 2 బస్తాల పోటాష్ తోపాటు బోరాన్, జింక్ సల్ఫేట్ మొత్తం 5 రకాల ఎరువులు రాయితీతో ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రూ. 14 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

పీలేరు మండలంలోని తలపులలో అన్నమయ్య, సిద్ధేశ్వర రైతు సంఘాలకు రూ. 14 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరైంది. స్థానికంగానే మామిడి గుజ్జు పరిశ్రమ ఏర్పాటు కానుంది. మామిడి రైతుల ఆర్థికాభివృద్ధి తోపాటు, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుంది. అలాగే జిల్లాలో 7.80 కోట్లతో 52 కలెక్షన్ సెంటర్లు మంజూరు కాగా 15 నిర్మాణ పనులు పూర్తి కాగా, మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ఇందులో రూ. 45 లక్షలతో అన్నమయ్య రైతు సహకార సంఘానికి మూడు కలెక్షన్ సెంటర్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

మామిడి రైతులకు ప్రభుత్వం చేయూత



మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది. మార్కెటింగ్‌లో దళారీ వ్యవస్థ లేకుండా పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడానికే సహకార సంఘాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తద్వారా రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందడం తోపాటు వారి పంటను వారే మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు లభించింది. మరోవైపు స్థానికంగా ఫుడ్ ప్రాససింగ్ యూనిట్ ఏర్పాటు కానుండడంతో రైతులకు, నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

నాణ్యమైన దిగుబడి సాధించాలి...



రైతులు మామిడి సాగులో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడి నాణ్యమైన పంట దిగుబడి సాధించాలి. మంచి యాజమాన్య పద్ధతులు పాటించాలి. సాధారణంగా రైతులకు 50 శాతం రాయితీ లభిస్తుండగా, సహకారం సంఘాలకు 75 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తోంది. కోల్డ్ హౌస్, కలెక్షన్ సెంటర్లు, ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, కాయల సరఫరాకు వ్యాన్లు ఏర్పాటు చేసుకోవడానికి ఒక్కో సంఘానికి రూ. కోటి వరకు ప్రభుత్వం ఇస్తుంది. ఇందులో 75 శాతం రాయితీ లభిస్తుంది.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సంఘాలతో అభివృద్ధి సాధించాం



గతంలో మామిడి పంటను విక్రయించాలంటే ఇబ్బందు లు ఎదురయ్యేవి. దళారులు సొమ్ము చేసుకునేవారు. రైతు లు నష్టాలు చవిచూసేవారు. అయితే తాము సహకార సంఘం ఏర్పాటు చేసుకోవడంతో మా తలరాతలు మారిపోయాయి. ప్రభుత్వం నుంచి రాయితీలు లభిస్తుండడం, అధికారులు సూచనలు, సహకారాలు ఇవ్వడంతో ఇబ్బంబదులు తొలగిపోయాయి. రెండేళ్లుగా మా పంటను మేమే విక్రయించుకుంటున్నాం. ఈ ఏడాది మా సంఘం ద్వారా 3 వేల టన్నులు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

– జయ్యబ్బనాయుడు, అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్షులు

వైఎస్ అవినాష్‌రెడ్డిపై సీబీఐ తీరు అమానవీయం

వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు



కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పట్ల సీబీఐ వ్యవహరిస్తున్న తీరు అమానవీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రెండేళ్లుగా వైఎస్ అవినాష్‌రెడ్డి సీబీఐ విచారణకు సహకరిస్తున్నారన్నారు. వారు ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరవుతున్నారన్నారు. 19వ తేది శుక్రవారం విచారణకు హాజరుకావడానికి గురువారమే హైదరాబాద్ చేరుకున్నారని, ఉదయం కూడా అక్కడే ఉన్నారన్నారు. విచారణకు వెళ్తూ మార్గమధ్యంలో తన తల్లికి లో బీపీ వల్ల ఆరోగ్యం బాగలేదనే సమాచారం అందుకుని వెనక్కి బయలుదేరారన్నారు. తన తల్లికి ఆరోగ్యం బాగలేదని, రెండురోజులు గడువు ఇవ్వమన్నా సీబీఐ ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నారని, తల్లిని చూసుకునేందుకు వైఎస్ అవినాష్ రెడ్డి తప్ప మరెవరూ లేరన్నారు. ఈ విషయాన్ని మానవతా దృక్పథంతో ఆలోచించకుండా సీబీఐ వారు వాహనాల్లో కర్నూల్ వరకూ వెంబడించడం బాధాకరమని సురేష్‌బాబు అన్నారు. నిందితులను అప్రూవర్‌గా మార్చి సీబీఐ విచారణ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీబీఐ అత్యుత్సాహం చూస్తుంటే అవతలివారితో కుమిట్ అయినట్లు అనుమానం వస్తోందన్నారు. సీబీఐ మొదటి నుంచి ఒకే కోణంలో విచారణ చేస్తోందని, మొదట కాల్ చేసిన శివప్రకాష్‌రెడ్డిని విచారించలేదన్నారు. సీబీఐ ఒకరికి తొత్తుగా వ్యవహరిస్తోందని తేటతెల్లం అవుతున్న నేపథ్యంలో దానిపై పూర్తిగా నమ్మకం కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. కొన్ని మీడియా చానెళ్లు వైఎస్ అవినాష్‌రెడ్డిని వెంబడించి కవరేజ్ చేయడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛకు కూడా ఒక హద్దు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. సీబీఐ అయినా, మీడియా అయినా మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలని సురేష్‌బాబు కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కె.సూర్యనారాయణరావు, మల్లికార్జున పాల్గొన్నారు.

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్ల సీబీఐ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీబీఐ విచారణకు అవినాష్‌రెడ్డి అ సహకరిస్తున్నప్పటికీ కావాలనే ఇబ్బందులు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు.

ఎంపీని వెంబడించడం సరికాదు : ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దేశ ద్రోహి అయినట్లుగా వెంబడించడం సీబీఐ అధికారులకు తగదని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ బంజారా హిల్స్‌లో ఉన్న తన నివాసం నుంచి 10.15 గంటలకు సీబీఐ కార్యాలయానికి బయల్దేరారన్నారు. హైదరాబాద్‌లో కొంత దూరం వరకు ఆయన ప్రయాణించారన్నారు. 10.30 గంటల ప్రాంతంలో అవినాష్ తల్లి పులివెందులలోని తన స్వగృహంలో ప్రేయర్ చేస్తుండగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్నారు. గుండె సంబంధిత వ్యాధితోనో లోబీపీ కారణంగానో ఆమె అనారోగ్యం పాలైందన్నారు. ముందుగా ఆమెను పులివెందులలోని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వైద్యులు సిఫారసు మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. విషయం తెలుసుకున్న అవినాష్‌రెడ్డి ఈ విషయాన్ని తన న్యాయవాది ద్వారా సీబీఐ అధికారులకు చేరవేశారన్నారు. తన తండ్రి భాస్కర్‌రెడ్డి జైలులో ఉండటంతో ఏకైక కుమారుడైన తాను వెంటనే తల్లిని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాల్సిన అవసరం ఉందని అవినాష్‌రెడ్డి న్యాయవాది ద్వారా చెప్పడం జరిగిందన్నారు. ఈ విన్నపాన్ని సీబీఐ అధికారులు ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా శత్రు దేశాలకు సమాచారాన్ని చేరవేసే దేశ ద్రోహిలా ఎంపీని 30-40 కిలోమీటర్ల వరకు వెంబడించారన్నారు. అవినాష్ తల్లికి వైద్యం చేయించేందుకు కర్నూలు వైపు నుంచి వస్తున్న అంబులెన్స్‌కు ఎదురు వెళ్లడం జరిగిందన్నారు. అయితే సీబీఐ అధికారులు మాత్రం వాస్తవ విషయాలను గమనించకుండా ఎంపీ కారును వెంబడించారన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆయన సీబీఐ అధికారుల విచారణకు హాజరయ్యారని, తల్లి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత రేపోమాపో యథావిధిగా విచారణకు హాజరవుతారన్నారు. ఒక రోజు గడువు కావాలని కోరినా ఇవ్వకపోవడం తగదన్నారు. రేపో మాపో హాజరైతే జరిగే నష్టం ఏమిటో అధికారులు తెలపాలని కోరారు. మానవీయ కోణంలో ఆలోచించకుండా ఇలా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు.

వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబు ఆనందం పొందుతున్నారు

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ముద్దాయిగా చేర్చిన అవినాష్ రెడ్డిని తప్పక అరెస్టు చేస్తారని తాను పది రోజుల ముందే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ హత్య కేసుతో ఏమాత్రం సంబంధం లేని అవినాష్ ఆరోపణలను ఎదుర్కొంటున్నాడని చెప్పారు. న్యాయ వ్యవస్థపై తమకు అపారమైన నమ్మకం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ఇంటి వద్ద వుంటూ ఉద్యోగాలు చేస్తూ రోజుకు వేలాది రూపాయల్లో సంపాదించండి.. అంటూ వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు అమాయకులైన వారిని మాయమాటలతో మభ్యపెడుతూ మెసేజ్ లింక్‌తో వున్న నకిలీ వెబ్‌సైట్‌ల పేరు చెబుతూ యూ ట్యూబ్‌లో యాడ్స్ ప్రమోషన్ చేస్తే భారీగా కమీషన్ ఇస్తామని ఆశచూపి మోసాలకు తెగబడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎస్పీ తెలిపారు. ఇందుకు కొంత పెట్టుబడి పెట్టాలంటూ మాయమాటలతో ఆశ చూపి ఇన్‌కం ట్యాక్స్, ప్రోసెసింగ్ ఛార్జీల పేరిట రూ. లక్షలకు లక్షలు కొల్లగొడుతున్నారని ఎస్పీ వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని ఎస్పీ సూచించారు.

సమస్యలను పరిష్కరించాలి

కడపలో 5 జిల్లాల ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ



ర్యాలీగా వస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

వైవీయూ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుంచి హరిత టూరిజం హోటల్ వరకు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రేటర్ రాయలసీమ పరిధిలోని కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు చెందిన కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 10 విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా 1100 డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ చదవలేని పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను అందిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలను ప్రభుత్వం తీర్చాలని కోరారు. జీఓ నెంబర్ 36కు అనుగుణంగా నూతన, అదనపు కోర్సులకు నోటిఫికేషన్ ఇచ్చారని, దీని ద్వారా కొత్త కోర్సులు పొందాలంటే ప్రతి కళాశాల యూజీసీ 2ఎఫ్, 12బి, న్యాక్ అనుమతి ఉండాలన్న నిబంధన పెట్టారన్నారు. ఈ నిబంధనలతో రాష్ట్రంలో ఏ కళాశాలకు కూడా కొత్త కోర్సులు వచ్చే అవకాశం లేదన్నారు. కావున పాత కళాశాలలకు జీఓనెంబర్ 36ను సవరించాలన్నారు. డిగ్రీ విద్యలో గత రెండు, మూడు సంవత్సరాలుగా ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, ఈ ప్రక్రియ వల్ల అకడమిక్ ఇయర్ ఆలస్యం అవుతోందన్నారు. కావున ఆన్‌లైన్ ప్రవేశాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరంకు సంబంధించి విద్యార్థులకు చెల్లించే ఆర్‌పీఎఫ్ (జగనన్న విద్యాదీవెన) నిధులు విద్యార్థి తల్లి ఖాతాల్లో కాకుండా ప్రిన్సిపాల్ ఖాతాలో వేయాలని కోరారు. ఏపీ ప్రైవేట్ కళాశాలల ఉమ్మడి కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. మదన్ మోహన్‌రెడ్డి, జి. వెంకటశ్రీను మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి డిగ్రీ కాలేజీ పర్మిషన్, అన్ని విశ్వవిద్యాలయాలకు కామన్ ఫీజు పెట్టాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రతి విద్యాసంవత్సరం క్రమపద్ధతిలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర సలహాదారు జి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉన్నతవిద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సలహాదారులు ద్వారకనాథ్‌రెడ్డి, పలు కళాశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్యంపై దుష్ప్రచారాలను నమ్మవద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివా నాయక్, డా. సొహైల్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై రెండు రోజులుగా సోషల్ మీడియాలో, ఎల్లో మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివా నాయక్, డా. సొహైల్ కోరారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సదుద్దేశ్యంతో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరుగార్చాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆరోగ్యశ్రీలో అనేక మార్పులు చేశారని, 3500లకుపైగా వ్యాధులను అందులో చేర్చారన్నారు. కోవిడ్, కేన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. ప్రైవేటు హాస్పిటల్స్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.368కోట్ల బకాయిలను నిన్ననే చెల్లించిందని, మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్య, ఆరోగ్య శాఖలో 46వేల ఉద్యోగాలను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారన్నారు. ప్రతి సచివాలయానికి ఒక వైద్య శాల, విలేజ్ క్లినిక్ వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఇవి మన రాష్ట్రంలో తప్పా దేశంలో ఎక్కడా అమలు కాలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ వైద్య విభాగం ఇన్‌చార్జి డా. అమీర్‌బాషా, డా. పుత్తా సతీష్‌రెడ్డి, జగన్ రాథోడ్ పాల్గొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధితోనే విస్తృత ఉపాధి అవకాశాలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రంగజనార్ధన

ప్రొద్దుటూరు కల్చరల్ : టెక్నాలజీ అభివృద్ధితోనే విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగజనార్ధన పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ రీసెర్చ్ ఇన్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్-2023 (ఈఆర్ఎస్ఈఎం)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాలల్లో ఒకటైన ఎస్ఆర్ఐటీలో మొదటగా ఇంటర్ నేషనల్ ఈఆర్ఎస్ఈఎమ్-2023ని నిర్వహించడం అభినందనీయమన్నారు. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ద్వారా మాత్రమే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.76వేల కోట్ల నిధులు సమకూర్చిందన్నారు. చెన్నైకి చెందిన ఎన్ఐటీటీటీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉషానటేషన్ మాట్లాడుతూ కళాశాల ఎన్ఐటీటీటీఆర్‌తో ఎంఓయూ ఒప్పందం చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి దేశం శాస్త్ర పరిజ్ఞానం మీదనే ఆధారపడి అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంజనీరింగ్, సైంటిస్ట్ వారివారి పరిశోధనలను ప్రదర్శించడం ఈ వేదిక ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన సావనీర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల న్యాక్ బీప్లస్, మూడు బ్రాంచ్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు ఉందన్నారు. తమ కళాశాలలో ఈఆర్ఎస్ఈఎం నిర్వహించడం తమకు గర్వకారణమని, 30 ప్రజెంటేషన్లు వచ్చాయన్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగనుందని తెలిపారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎల్ఎం పట్నాయక్, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అకడమిక్ డీన్ సుబ్బారెడ్డి, ఏఓ జగదీశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విష ద్రావణం తాగి మూగజీవాలు మృతి



మృతి చెందిన జీవాలు

మైదుకూరు : మండలంలోని పోతిరెడ్డిపల్లె వద్ద శుక్రవారం క్రిమి సంహారక మందు కలిపిన ద్రావణాన్ని తాగి 9 మూగజీవాలు మృతి చెందాయి. అనుమానమున్న ఇద్దరు వ్యక్తులపై వాటి యజమాని మీగడ శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పోతిరెడ్డిపల్లెకు చెందిన శివారెడ్డి తనకున్న 18 మేకలు, పొట్టేళ్లను గ్రామానికి సమీపంలోని కొండకు తోలుకొని వెళుతుండేవాడు. దారిలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కేశలింగాయపల్లెకు చెందిన సుబ్బయ్య, వెంకటరమణ అనే వారి పొలాలు ఉన్నాయి. ఒకటి రెండు సార్లు శివారెడ్డి మేకలు సుబ్బయ్య, వెంకట రమణలకు చెందిన బీడు పొలాల గుండా వెళ్లేవి. అక్కడున్న ప్లాస్టిక్ డ్రమ్ములోని నీటిని తాగుతుండేవి. ఈ విషయమై రెండు నెలల కిందట సుబ్బయ్య, వెంకటరమణ ఇద్దరు శివారెడ్డిని మందలించారు. ఇంకోసారి తమ పొలాల గుండా జీవాలను తోలుకొని వెళ్తే డ్రమ్ములోని నీటిలో విషం కలుపుతామని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం జీవాలను కొండకు తోలుకొని వెళ్లి 9 గంటల ప్రాంతంలో శివారెడ్డి జీవాలతో తిరిగి ఇంటికి బయల్దేరాడు. వెంకటరమణ పొలంలోని డ్రమ్ములోని నీటిని కొన్ని జీవాలు తాగాయి. చూస్తుండగానే అవి నేలపై పడి నురగకక్కుకొని మృతి చెందాయి. ఇందులో ఏడు మేకలు, రెండు పొట్టేళ్లు ఉన్నట్లు బాధితుడు శివారెడ్డి తెలిపారు. రెండు నెలల కిందట హెచ్చరించినట్టుగానే సుబ్బయ్య, వెంకటరమణలే నీటిలో క్రిమి సంహారక మందు కలిపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీవాల మృతితో తనకు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్టు శివారెడ్డి తెలిపారు.

సిటీ స్కానింగ్‌ను వినియోగించుకోండి



రేడియాలజీ విభాగంలో కేక్ కట్ చేస్తున్న రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపి విభాగంలో సరిగ్గా రెండేళ్ల క్రితం సిటీ స్కాన్ యంత్రాన్ని రేడియాలజీ విభాగంలో ప్రజలకు ఉచితంగా, అత్యాధునికంగా పరీక్షల కోసం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఓపిలోని రేడియాలజీ విభాగంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్‌లోని రేడియాలజీ విభాగంలో 24/7 వేళల్లో ప్రజలకు అందుబాటులో వుండి, అవసరమైన వారికి అన్ని రకాల, అత్యాధునిక పద్ధతుల్లో సిటీ స్కాన్ పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే 24 వేల సిటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారన్నారు. భవిష్యత్తులో కూడా సిటీ స్కాన్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, రేడియాలజీ విభాగం ఇన్‌ఛార్జ్ హెచ్ఓడి డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మా నగలు మాకివ్వండి



మాట్లాడుతున్న వెంకటసుబ్బమ్మ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని రంగసముద్రం బ్రాంచి స్టేట్ బ్యాంకులో 2018లో తాకట్టు పెట్టిన బంగారు నగలు ఇప్పటికీ ఇవ్వకుండా బ్యాంకు మేనేజర్, సిబ్బంది తిప్పుకుంటున్నారని.. మా నగలు మాకివ్వండి.. అంటూ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కాశినాయన మండలం కోడిగుడ్లపాడుకు చెందిన మహిళారైతు పిచ్చపాటి వెంకటసుబ్బమ్మ శుక్రవారం తన బంగారు నగలు కోసం బ్యాంకుకు వస్తే బ్యాంకు మేనేజర్ అదే పాట పాడటంతో ఆమె ఉద్విగ్నతకు లోనయింది. ఆమె మాటల్లోనే..

2018లో 148 గ్రాముల బంగారు నగలు తాకట్టు పెట్టి రంగసముద్రం ఎస్‌బీఐ లో రూ. 2 లక్షలు తీసుకున్నాము. 2019లో అప్పటి క్యాషియర్ గురుమోహన్‌రెడ్డి బంగారు, డబ్బుతో పరారు కావడంతో ఎవరి బంగారు పోయిందో అర్థం కాక అల్లాడిపోయాము. వచ్చి అడిగితే నెల రోజుల్లో రికవరి చేసి మీ బంగారు ఇస్తాము, ఏమీ భయపడవద్దు, అంటూ నమ్మబలికారు. ఓ రోజు మీ బంగారు ఇస్తాము రమ్మన్నారు. వడ్డీ మొదలు రూ. 2,34,500 జమ చేశాక, ఓ నల్లపూసల దండ ఇచ్చారు. నెక్లెసు, హారం ఇవ్వలేదు. అవి లేవని రూ. 5 లక్షలు ఇస్తామన్నారు. మాకు డబ్బు వద్దు మా బంగారు మాకు కావాలని మేము అడిగాము. దాంతో మళ్లీ టైమ్ చెప్పారు. నెలల తరబడి తిరుగుతున్నా కొంత రికవరీ అయిందని, ఇంకా కావాల్సి ఉందంటున్నారు. మా బంగారు నగలు మాత్రం ఇవ్వడం లేదు. ఆ రోజు చిన్న కూతురు పెండ్లి కోసం పెద్ద కుమార్తె నగలు తాకట్టు పెట్టాము. ఈ రోజు పెద్దకూతురు బంగారు నగల కోసం మాపై ఒత్తిడి తెస్తోంది. తన నగలు తనకు కావాలని పట్టు పడుతోంది. అప్పటి బ్యాంక్ మేనేజర్ బదిలీ అయిపోయాడు. ఇప్పుడున్నాయన పట్టించుకోవడం లేదు. పైగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. బాకీలు చేసి వడ్డీలు పెరిగి అల్లాడుతున్నాము. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.. లేదంటే ఆత్మహత్య శరణ్యం.. అని వెంకటసుబ్బమ్మ ఆవేదనతో పేర్కొంది.

ట్రావెల్స్ నిర్వాహకులపై చీటింగ్ కేసు

కడప అర్బన్ : కడపలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో వున్న హిందూస్తాన్ ట్రావెల్స్ నిర్వాహకులైన సాదిక్ ఆలీఖాన్, జరీనాబేగంలు గతనెల 13వ తేదీన ఉమ్రా యాత్ర కోసం ఐదుగురు సభ్యులున్న సయ్యద్ ఖలీల్ నుంచి రూ. 7 లక్షలు వసూలు చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా హైదరాబాద్ నుంచి ఉమ్రాయాత్రకు విమానం టికెట్లను, వచ్చేందుకు, వెళ్లేందుకు, జద్దాలో వసతిసౌకర్యాల కోసం ఈ డబ్బులను తీసుకున్నాడు. వారికి టికెట్లను ఇచ్చి మొదట హైదరాబాద్ నుంచి జద్దాకు పంపించాడు. అక్కడకు వెళ్లగానే ఎలాంటి సౌకర్యాలు లేవనీ వారు తెల్చిచెప్పారు. అంతేగాక తిరుగు ప్రయాణంలో విమానం టికెట్లను రద్దు చేసి డబ్బులను కూడా నిందితులు తీసేసుకున్నారు.

దీంతో బాధితులు అక్కడ వ్యయప్రయాసలు పడ్డారు. ఈనెల 1వ తేదీన మరలా కడపకు వచ్చారు. ఈక్రమంలో తమకు జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించారు. కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు



కడప రిమ్స్‌లో రోగులతో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

కడప అర్బన్ : కడప రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారని ఏపీ పంచాయితీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అడ్వైజర్ పి. నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం కడపలోని రిమ్స్ వైద్యశాలలోని ఓపి, ఐపి విభాగాలను నాగార్జున రెడ్డి పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప రిమ్స్‌లోని ఆరోగ్యశ్రీవార్డు, సర్జికల్, మెడికల్ విభాగాల వార్డులను పరిశీలించామన్నారు. వైద్య సిబ్బంది పనితీరును, భోజన వసతులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలతో పాటు, ఖాళీగా వున్న పోస్టుల వివరాలను అడిగి తెలుసుకున్నామన్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పనితీరు బాగుందని రోగులు తెలియజేశారన్నారు.

ముంపు పొలాల పరిశీలన



సోమశిల ముంపు పొలాలపై విచారిస్తున్న జేసీ, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ తదితరులు

అట్లూరు : సోమశిల ముంపు పొలాలను శుక్రవారం జాయింట్ కలెక్టరు గణేష్‌కుమార్, గాలేరు నగరి సుజల స్రవంతి స్పెషల్ కలెక్టరు పెద్దిరాజు, రాజంపేట యూనిట్-4 డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. చౌటపల్లి గ్రామ సమీపాన ఓ రైతు తనపొలం సోమశిల ముంపు జలాలకింద ముంపునకు గురౌతున్నా అధికారులు ముంపు పరిగణలోకి తీసుకోలేదని ఆ రైతు హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. కోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం వారు సంబంధిత పొలాలు ముంపునకు గురవుతాయా లేదా అనే అంశంపై పరిశీలించారు. వాస్తవ నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేస్తామని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక తహసీల్దారు శ్రీవాణి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి



మృతి చెందిన సాత్రి మరియమ్మ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఐదు రోజుల కిందట గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో సాత్రి మరియమ్మ(65) అనే వృద్ధురాలు గాయపడి కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయితే పరిస్థితి విషమించి ఆమె శుక్రవారం మృతి చెందింది. కాగా ఇదే ప్రమాదంలో గాయపడిన ఆమె భర్త సాత్రి జేమ్స్ గత రెండు రోజుల కిందట మృతి చెందాడు. తల్లి, తండ్రి ఇరువురు మృతి చెందడంతో వారి పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. కాగా ముగ్గురికి వివాహం అయినట్లు బంధువర్గాలు తెలిపాయి.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు




కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని మార్చురీలో శుక్రవారం గుర్తు తెలియని ఇద్దరు మృతదేహాలను వుంచారు. వారి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను నేరుగా సంప్రదించవచ్చని ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

ద్విచక్ర వాహనంలో మంటలు

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని ఓ దుకాణం వద్ద శుక్రవారం పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగాయి.నాలుగురోడ్ల కూడలిలోని శ్రీనివాస మొబైల్ షాపు వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని దుకాణం బయట నిలిపి పని నిమిత్తం లోపలికి వెళ్లి పని ముగించుకుని మరో చోటికి వెళ్లాడు.అయితే కొద్ది సేపటికి ద్విచక్ర వాహనం నుంచి పెద్ద ఎత్తున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది.

చీటీల పేరుతో వ్యక్తి మోసం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి తన దగ్గర చీటీలు వేసిన వారి దగ్గరి నుంచి దాదాపు రూ. కోటికి పైగా డబ్బులను వసూలు చేసుకుని పరారయ్యాడు. పేద, మధ్యతరగతి ప్రజలైన బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై చిన్నచౌక్ పోలీసులను వివరణ కోరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

సంబేపల్లె: మండల పరిధిలోని దుద్యాల పంచాయతీ గుట్టమీదపల్లెకు చెందిన పల్లపు గంగిరెడ్డి (56) అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుట్టమీదపల్లెకు చెందిన గంగిరెడ్డి ఆవులు మేపుతుండగా శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గ్రామ సమీపంలోని చింతలకుంటబాయి సమీపంలోని చింతచెట్టు దగ్గర ఉన్న గంగిరెడ్డి, ఆవులపై ఒక్కసారిగా పిడుగుపడటంతో గంగిరెడ్డితోపాటు ఆవు అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి కుమారుడు, భార్య ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న మామిడి చెట్లు

సిద్దవటం : టక్కోలి గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాజీపల్లె ఎర్ర చెరువును ఆనుకొని ఉన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సింగం నీలకంఠారెడ్డి అనే రైతుకు సంబంధించిన మామిడి వనంలో కంచె వెంబడి ఉన్న చెట్లు అగ్నికి కాలిపోయాయి. ముళ్ల కంప కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కంచె కాలి మంటలు ఎగిసిపడి కంచెను ఆనుకొని ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయి. దీంతో రూ. 2. 50 లక్షల నష్టం వాటిల్లిందని రైతు నీలకంఠారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వీఆర్ఓ కేశవులు దెబ్బతిన్న మామిడి చెట్లను పరిశీలించి అగ్ని ప్రమాదంలో మామిడిచెట్లకు, కాయలకు జరిగిన నష్టాన్ని పరిశీలించి నివేదికను తయారు చేసి హార్టికల్చర్ అధికారులకు పంపుతామని అన్నారు.